

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పిన అనంతరం మాట్లాడుతున్న తాతా మధు

- తెలంగాణ పోరాట స్ఫూర్తితో బీసీలకు మద్దతుగా బీఆర్ఎస్
- కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ప్రజలకు అండగా గులాబీదళం
- నేడు ఖమ్మం నగరంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటన
- బీసీల రౌండ్‌టేబుల్ మీటింగ్ సహా పలు ప్రోగ్రాంలకు హాజరు

**కవిత పర్యటన ఇలా..**

- శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం జైలులో బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్ రావును పరామర్శిస్తారు.
- 11 గంటలకు ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 2 గంటలకు బైపాస్ రోడ్‌లోని సప్తపది ఫంక్షన్ హాల్లో బీసీ రిజర్వేషన్లపై జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తారు.



# మరో ఉద్యమానికి సిద్ధమైన ఖమ్మం

ఖమ్మం, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు ఇటీవల నిర్వహించిన కులగణనలో బీసీలకు జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్ కన్నెర్ర చేసింది. ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్.. పదేళ్ల తరువాత తన పోరాట స్ఫూర్తిని మరోసారి రగిలించింది. ఇప్పటికే బీసీ కులగణన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వ మెడలు వంచిన బీఆర్ఎస్.. రాష్ట్రవ్యాప్తంగా బీసీలను సమీకరించే మరో ఉద్యమానికి సిద్ధమైంది. బీసీలకు వెన్నుదన్నుగా నిలవడంతోపాటు బరిగీసి రంగంలోకి దిగింది. బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావు పలు జిల్లాల్లో పర్యటిస్తూ కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగడుతున్నారు. అనేక విషయాల్లో కాంగ్రెస్‌కు వణుకు పుట్టిస్తున్నారు. ఇదే క్రమంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా శనివారం ఖమ్మంలో పర్యటించనున్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తరువాత ఆ మాట తప్పి బీసీలను మళ్లీ మోసం చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో నిర్వహించే బీసీల రౌండ్ టేబుల్ సమావేశానికి కవిత హాజరుకానున్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఖమ్మం జిల్లాలోని అన్ని పార్టీల నుంచి బీసీ సంఘాల నేతలు, తెలంగాణ జాగృతి సభ్యులు, ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. దీంతో బీసీలకు జరిగిన అన్యాయంపై నిర్వహించే మరో ఉద్యమానికి ఖమ్మం కేంద్రం కానుంది. తెలంగాణ ఉద్యమం మలుపుతిరగడంలో ఖమ్మం ఎలా కేంద్ర బిందువైందో.. ఇప్పుడు బీసీలకు జరిగిన అన్యాయంపై జరిగే ఉద్యమంలోనూ ఖమ్మం కీలకమవుతోంది. ఉద్యమ జెండాను ఎత్తి పోరాటానికి సన్నద్ధమవుతోంది. ఇందుకు ఖమ్మం జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాయి. వివిధ కులాలకు చెందిన బీసీ సంఘాల నేతలు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఉద్యమంలో పాల్పంచుకోనున్నారు. ఎమ్మెల్సీ కవిత పోరాటానికి మద్దతుగా ఖమ్మం జిల్లాలోని బీసీ నాయకులు కదుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని వారు మండి పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఖమ్మంలో జరుగనున్న ఎమ్మెల్సీ కవిత పర్యటన వివరాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు వెల్లడించారు.

## కాంగ్రెస్‌ను గెలిపించామని..
# ప్రజలు బాధపడుతున్నారు

- బీఆర్ఎస్‌లో చేరిన వారు భయపడాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారు..
- పొంగులేటి ఇలాకాలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు
- 30 కుటుంబాలను ఆహ్వానించిన ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, ఫిబ్రవరి 14: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలందరూ ఇప్పుడు బాధపడుతూ ఆత్మ పరిశీలన చేసుకుంటున్నారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు గాదరి వీరస్వామి, అన్నపర్తి పరశురాం, సురేశ్‌లతోపాటు 30 కుటుంబాలకు చెందిన వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో వీరికి ఎమ్మెల్సీ తాతా మధు గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు విని ఆ పార్టీకి ఓట్లు వేశామని, కేసీఆర్‌ను ఓడించడం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నదని భావించి కాంగ్రెస్‌ను వీడుతున్నామని ఆ పార్టీ నాయకులు, ప్రజలు అంటున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నదని వివరించారు. కేసీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదని విమర్శించారు. కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరిగిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనను భవిష్యత్‌కు పెనుప్రమాదంగా భావిస్తూ.. కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు పలువురు కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. బీఆర్ఎస్ తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల అధ్యక్షులు బాషబోయిన వీరన్న, బెల్లం వేణు, నాయకులు దీవల శ్రీనివాసరావు, పోట్ల జగదీశ్, పోట్ల నాగేశ్వరరావు, అనపర్తి ఉప్పలయ్య, అన్నపర్తి ఎల్లయ్య, సందరబోయిన పాపారావు, ఇండ్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సదుపాయాల కల్పనకు..
# ప్రణాళికలు రూపొందించండి

**రొంపేడు ఏజీహెచ్ఎస్ తనిఖీలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 14: ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. రొంపేడు ఏజీహెచ్ఎస్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.. డార్మెటరీ, కిచెన్, బాత్‌రూమ్స్, నల్లాలు, తరగతి గదులు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాలకు అవసరమైన మినరల్ వాటర్ ప్లాంట్, న్యూ కిచెన్ రూమ్, స్టీమ్ బాయిల్డ్, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, హాల్ మెస్‌డోర్స్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు పాఠశాల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన వసతి, సదుపాయాలు, సౌకర్యాల కోసం ప్రణాళిక రూపొందించి తనకు సమర్పిస్తే వాటి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



**యాక్టివ్‌గా లేని కార్డుల తొలగింపు**

భద్రాద్రి జిల్లాలో మొత్తం 2.23 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 4.58 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. కానీ, యాక్టివ్ జాబ్‌కార్డులు మాత్రం 1.35 లక్షలు మాత్రమే ఉన్నాయి. వీటి ద్వారా 2.28 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వీరిలో 11.62 శాతం ఎస్సీలు, 61.12 శాతం మంది ఎస్టీలు ఉపాధి పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ 2.30 లక్షల మంది కూలీలను ఉపాధి హామీ పథకం నుంచి తొలగించే ఆలోచనలో ఉంది. ఇదే జరిగితే కొత్తగా అర్హులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందని ద్రాక్షే అవుతుంది.

- ఈజీఎస్ జాబ్‌కార్డులు నిలిపివేసిన కాంగ్రెస్ సర్కారు
- నూతన కార్డులివ్వకుండా ఆన్‌లైన్‌లో లాక్ చేసిన ప్రభుత్వం
- 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'తో కార్డులకు పెరిగిన డిమాండ్
- కొత్త దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్.. సవరణలకూ నో ఛాన్స్
- జాబ్‌కార్డులు మనుగడలో లేని కూలీల పరిస్థితి ప్రశ్నార్థకం
- ఆత్మీయ భరోసా పథకం, ఉపాధి పనులకు నోచుకోని అర్హులు

# ఉపాధి కార్డు హుష్‌కాకి!

**కూలీల వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డుల జారీని రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ నిలిపివేసింది. దీంతో కొత్త దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్ పడింది. ఇప్పటికే ఉన్న జాబ్‌కార్డుల్లో సవరణలకూ అవకాశం కల్పించడం లేదు. ఫలితంగా అటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధికీ నోచుకోక, ఇటు ఉపాధి హామీ పనులు లభించక నిరుపేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అమలుతో ఉపాధి జాబ్‌కార్డులకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇప్పటికే సంక్షేమ పథకాల అమలుకు ఆపసోపాలు పడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. కొత్త కార్డులు జారీ చేయకుండా ఆన్‌లైన్‌లో లాక్ చేసింది. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉపాధి సిబ్బందికి మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతోపాటు యాక్టివ్‌గా లేని జాబ్‌కార్డులను తనిఖీ చేసి తొలగించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. దీనివల్ల అర్హులైన నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరుగనున్నది.**

**-అశ్వారావుపేట, ఫిబ్రవరి 14**

వలసలను నివారించి కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించే లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పనుల కోసం వెళ్లే కూలీలకు జాబ్‌కార్డులు జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో లాక్ చేసింది. దీంతో సుమారు నెల రోజులుగా జాబ్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. దీనికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. వ్యవసాయ భూమి లేని కూలీలకు ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకం కింద ఒక్కో దఫాకు రూ.6 వేల చొప్పున ఏటా రెండు దఫాలుగా రూ.12 వేల నగదు అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని ఆ గ్రామంలోని లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.6 వేలను జమ చేసింది. మిగతా లబ్ధిదారులకు ఈ ఏడాది మార్చి 31లోగా జమ చేస్తామని చెప్పింది. అయితే, పథకం కింద లబ్ధి పొందాలంటే ఏడాదిలో కూలీలు కనీసం 20 రోజులు ఈ జాబ్‌కార్డుపై పని చేయాల్సి ఉంటుంది. దీంతో తదుపరి ఆర్థిక సంవత్సరంలో ఆత్మీయ భరోసాకు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ ఏడాది జాబ్ కార్డు పొంది దానిపై 20 రోజులు పనిచేసి ఉండాలి. ఇందుకోసం చాలామంది నిరుపేదలు జాబ్‌కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, నూతన జాబ్‌కార్డుల జారీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఫలితంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు కూలీలు దూరమవుతున్నారు.

### జాబ్‌కార్డు జారీ ఇలా..

ఉపాధి హామీ కూలీలు పనుల కోసం దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో పరిశీలన పూర్తి చేయాలి. ధ్రువీకరణ పూర్తి కాగానే అర్హులైన కూలీలకు గ్రామపంచాయతీ స్థాయిలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది జాబ్‌కార్డును జారీ చేస్తారు. ఏడాదిలో ఎప్పుడైనా కూలీలు జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, ఓటరు ఐడీ, బ్యాంక్ పాసు పుస్తకం, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో ఇస్తే చాలు.. వెంటనే జాబ్‌కార్డులు జారీ చేస్తారు. జాబ్‌కార్డు ఉన్న కూలీలు ఐదు కిలోమీటర్ల దూరంలో ఎక్కడైనా ఉపాధి పనులకు హాజరు కావొచ్చు. జాబ్‌కార్డు ఆధారంగా ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు 15 రోజులకు ఒక సారి వేతనాల చెల్లింపులు జరుగుతాయి.

### జాబ్‌కార్డుల జారీ ప్రక్రియ నిలిచింది



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో కొత్త జాబ్‌కార్డుల జారీని నిలిపివేశాం. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో జాబ్‌కార్డు దరఖాస్తులు నమోదు ప్రక్రియ జరగడం లేదు. యాక్టివ్‌గా లేని జాబ్‌కార్డులను తనిఖీ చేసి తొలగించాలని ప్రభుత్వం నుంచి సర్క్యులర్ జారీ అయింది. వాటిని కూడా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

**-రామచంద్రరావు, ఈజీఎస్ ఏపీవో, అశ్వారావుపేట**

### కూలీలందరికీ కార్డులు జారీ చేయాలి



ఉపాధి హామీ పథకం కింద అర్హులైన కూలీలందరికీ కొత్త జాబ్‌కార్డులు జారీ చేయాలి. అడిగిన కూలీలకు ఉపాధి పనులు చూపాలి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఉపాధి హామీ కూలీలందరికీ సాయం అందించాలి. కొత్త జాబ్‌కార్డులు ఇవ్వకపోవడం సరికాదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ఉపాధి కూలీలకు రూ.12 వేలు అందించాలి.

**-బుడితి చిరంజీవినాయుడు, అశ్వారావుపేట**

# ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళా సాధికారత

**మహిళా వ్యాపారవేత్తల శిక్షణలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



మాట్లాడుతున్న కలెక్టర్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి 14: ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రెండ్రోజుల పాటు జిల్లాలోని గ్రామీణ మహిళా వ్యాపారవేత్తలు, సెర్ప్ సిబ్బందికి చిన్నతరహా వ్యాపారాల నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రారంభమైన మొదటి రోజు శిక్షణలో మధిర, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక బలం, ఆర్థిక స్వాతంత్రత ఉంటేనే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతంకావడం వల్ల కుటుంబాలు బాగుపడతాయని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు కూడా ఎదిగేందుకు నమ్మకం ముందుతరాలకు వస్తుందన్నారు. వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు ధైర్యం ఉండాలని, ప్రారంభంలో మనకు వందరకాల సందేహాలు, భయాలు ఉంటాయని వీటిని అధిగమిస్తూ కొత్త కొత్త విషయాలను నేర్చుకుంటూ వ్యాపారాలు చేయాలన్నారు. మన పరిసర ప్రాంతాల్లో కస్టమర్ల ఆలోచనా సరళిని పరిశీలించి వ్యాపారాలు ఉండాలన్నారు. మన దగ్గర ఉన్న డబ్బును రెట్టింపు ఎలా చేయాలి అనే ఆలోచన నిరంతరం ఉండాలని, మనకు సరిపోతుంది అనే ఆలోచన ఉండవద్దన్నారు. జీవనోపాధి పెంపుదల, వ్యాపారాల నైపుణ్యాభివృద్ధికి అందించే శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, మహిళలకు అవసరమైతే అదనపు శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు సరైన అవకాశాలు లేక వెనకబడి ఉన్నారని, వారికి అవకాశాలు వస్తే అద్భుతంగా రాణించే శక్తి వారికి ఉందన్నారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఏపీ) స్కిల్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలకు ఉన్న అవకాశాల గురించి తెలుసుకొని పైకి ఎదగాలన్నారు. తల్లిగా పిల్లలను ఎలా జాగ్రత్తగా పెంచుతారో, అదే రీతిలో మన వ్యాపారాలను కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించి దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు దోహదపడాలన్నారు. మహిళలకు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, అడిషనల్ డీఆర్డీవో నూరొద్దీన్, ఏఎల్ఈఏపీ విజయవాడ రీజినల్ మేనేజర్ సునీత, ఐఓఎల్ ట్రైనర్ శివ నారాయణ, సీహెచ్ రవీందర్, హైదరాబాద్ సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా చదవాలి

- విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు అధ్యాపకులు శ్రద్ధ తీసుకోవాలి
- కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సులో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 14: ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని; ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా చదవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. పట్టణంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి పీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గిరిజన పాఠశాల, కళాశాలలో విద్య, ఉద్యోగ సమాచారం కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు బాలబాలికల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిలో విద్యాప్రమాణాలు మరింతగా పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవడంతోపాటు తదుపరి కోర్సులపై పూర్తి అవగాహన కల్పించాలని, ఇందులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. 23న ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష నిర్వహిస్తున్నామని, ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురు పిల్లలను ఎంపిక చేసి పరీక్షకు పంపించాలన్నారు. పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, తద్వారా ఉత్తీర్ణతా శాతం పెంచుకోవచ్చన్నారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, గురుకుల ఆర్‌సీవో నాగార్జునరావు, ఏసీఎంవో రమణయ్య, ఐటీడీఏ స్పెషలాఫీసర్లు, ఏటీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'పామాయిల్ నర్సరీ'లకు కొత్త మార్గదర్శకాలు

- ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తల ముందడుగు
- హాఫ్‌టైప్ మొక్కలు ఇక రైతుల దరిచేరవు..
- 25 శాతం కల్లింగ్ మొక్కలు వస్తే ఆ బ్యాచ్ రిజెక్ట్



ఆయిల్‌పామ్ నర్సరీ

దమ్మపేటరూరల్, ఫిబ్రవరి 14: పామాయిల్ నర్సరీ నిర్వహణకు ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రిసెర్చ్(ఐఐఓపీఆర్) కొత్త మార్గదర్శకాలను సూచించింది. ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తల ఈ ముందడుగుతో హాఫ్ టైప్ మొక్కలు, నాసిరకం మొక్కలు ఇక రైతుల దరచేరవు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ పరిధిలోని రైతులకు ఆయిల్‌ఫెడ్ నర్సరీల నుంచి వందల ఎకరాలకు హాఫ్‌టైప్ మొక్కలు చేరడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయమై ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ యాజమాన్యం, తెలంగాణ ఉద్యానశాఖలకు రైతులు మొరపెట్టినా పట్టించుకోవడం లేదు. హాఫ్‌టైప్ మొక్కల సమస్యతో ఖమ్మంజిల్లాకు చెందిన ఓ రైతు న్యాయ పోరాటం ప్రారంభించాడు. నాసిరకం మొక్కలతో రైతులు ఆర్థికంగా నష్టపోవడంతోపాటు సదరు పామాయిల్ కంపెనీకి సుమారు 30ఏళ్లపాటు పామాయిల్ గెలలు రాకుండా నష్టం కలుగుతున్నదని వ్యవసాయశాఖ ముఖ్యనేతకు నిపుణులు చెప్పినా వినడం లేదని తెలుస్తోంది. హాఫ్‌టైప్ మొక్కలను చూసి కొత్త రైతులు పామాయిల్ సాగుకు ముందుకురారని నేతలు, అధికారుల ఎదుట మొత్తుకున్నా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు.

**కొత్త మార్గదర్శకాలు ఇవే..**

- 25 శాతం కల్లింగ్ మొక్కలు వస్తే ఆ బ్యాచ్ మొక్కలను రైతులకు ఇవ్వకుండా తిరస్కరించాలి
- ప్రాథమిక నర్సరీలో సుమారు 10-15 శాతం అసాధారణ లక్షణాలు వచ్చే అవకాశం ఉంది. వాటిని గుర్తించి కాల్చివేయాలి.
- విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పామాయిల్ మొక్కలను నర్సరీ స్థాయిలో 5-10 శాతం కల్లింగ్ మొక్కలు ఉంటే వాటిని వేరు చేసి నాణ్యమైన మొక్కలను రైతులకు ఇవ్వడానికి సిఫార్సు చేయాలి.
- కల్లింగ్ మొక్కలు 25శాతం మించితే సదరు బ్యాచ్‌ను మొత్తం తిరస్కరించాలి. తిరస్కరించిన బ్యాచ్ మొలకలను సరఫరా చేసిన సంస్థ నుంచి పరిహారంగా తిరిగి వేరే మొక్కలను తీసుకోవాలి.
- సన్నని, బలహీనకాండం కలిగిన మొక్కలను వేరు చేసి కాండం బలంగా ఉండి 12 నెలలు పూర్తి చేసుకున్న మొక్కలను మాత్రమే రైతులకు ఇవ్వాలి.
- ఈ నిబంధనల ప్రకారం రేగళ్లపాడు నర్సరీలో మొక్కలన్నీ ధ్వంసం చేసి కంపెనీ నుంచి పరిహారం రాబట్టాలి. ఇప్పటికే సరఫరా చేసిన మొక్కలను శాస్త్రవేత్తలతో తనిఖీ చేయించి రైతులకు న్యాయం చేయాలి.

# కాలుష్య కారక ఓసీలను స్తంభింపజేస్తాం..

- సింగరేణి సత్తుపల్లి గనుల సైలో బంకర్ బాధితుల స్పష్టీకరణ
- అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి రాష్ట్రీయ రహదారిపై బైఠాయింపు



రహదారిపై అర్ధనగ్నంగా రాస్తారోకో చేస్తున్న సైలో బంకర్ బాధితులు

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 14: నిత్యం కాలుష్యాన్ని వెదజల్లుతున్న సైలో బంకర్, ఓసీలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి మండలం కిష్టారం అంబేద్కర్ నగర్, బీసీ కాలనీల బాధితులు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రీయ రహదారిపై బైఠాయించారు. కాలుష్యాన్ని వెదజల్లుతూ తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్న సైలో బంకర్‌ను, ఓసీలను స్తంభింపజేస్తామని, రైలు మార్గం గుండా తరలిస్తున్న బొగ్గు రవాణాను అడ్డుకుంటామని, కిష్టారం జేవీఆర్ ఓసీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. రాస్తారోకో సందర్భంగా రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు చేరుకుని బాధితులతో మాట్లాడారు. అనంతరం కిష్టారం పీవో నరసింహారావును రిలే నిరాహార దీక్ష శిబిరం వద్దకు పిలిపించి బాధితులతో మాట్లాడించారు. సమస్యను ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పీవో చెప్పడంతో ససేమిరా అన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు టెంటు తీసేది లేదని, దీక్ష కొనసాగించడంతోపాటు కిష్టారం ఓసీల్లో అన్ని రకాల పనులను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. దీక్షలకు సీపీఐ(ఎం) అనుబంధ సంఘాల నేతలు సంఘీభావం తెలిపాయి.